క్లుప్తంగా

కుంగుతున్న గోదావరి గట్టు రోడ్డు



ధ్వంసమైన గోదావరి గట్టు రోడ్డు

నరసాపురం: పట్టణంలోని గోదావరి గట్టు రోడ్డు ధ్వంసమవుతుంది. పడవలరేవు నుంచి కొండాలమ్మగుడి వరకూ రోడ్డుకు పలు చోట్ల గోతులుపడ్డాయి. రోడ్డు చాలా చోట్ల కుంగిపోయింది. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. దీంతో మార్నింగ్ వాకింగ్ వచ్చే వాళ్లతో పాటు సాయంత్ర సమయంలో సేదదీరడానికి వచ్చే వారు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గవర కులస్తులకు సంక్షేమం అందించేందుకు కృషి

పాలకొల్లు అర్బన్: గవర కులస్తులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందజేయడానికి తన వంతు కృషి చేస్తానని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. పాలకొల్లు మండలం గవరపేటలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. గవరపేటలో పలు సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ముఖ్యంగా గవర కులస్తులకు కార్పొరేషన్ ద్వారా కళ్యాణ మండపం నిర్మించడానికి స్థానిక మంత్రి రామానాయుడు, సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళతానన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మళ్ల వెంకట మురళి ఉన్నారు.

వైభవంగా దాసాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ



గవరపేటలో దాసాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని గవరపేటలో బల్లవంతెన వద్ద దాతల విరాళాలతో నిర్మించిన శ్రీ దాసాంజనేయస్వామి, శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల కల్యాణం గ్రామంలోని 30 మంది దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠలో కుంభం పోశారు. అలాగే గో దర్శనం చేశారు. శిఖరంపై నుంచి బూరెలు పోశారు. అర్చక స్వామి బ్రహ్మశ్రీ ర్యాలి శివరామశర్మ తో పాటు వేద పండితుల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 5 వేల మందికి అన్నసమారాధన చేశారు.

నూర్ బాషా సంఘ అధ్యక్షురాలిగా హుస్సేన్ బీబీ



షేక్ హుస్సేన్ బీబీ

పెనుగొండ: నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా తాడేపల్లిగూడేనికి చెందిన షేక్ హుస్సేన్ బీబీని నియమిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు షేక్ సయ్యద్‌బాజీ ఓ ప్రకటనలో తెలిపారు. నూతన అధ్యక్షురాలిగా నియమితులైన హుస్సేన్ బీబీని శనివారం పలువురు అభినందించారు. ఈ సందర్భంగా హుస్సేన్ బీబీ మాట్లాడుతూ పదవిని బాధ్యతగా తీసుకుంటానన్నారు. మహిళా సంక్షేమానికి కృషి చేస్తూ వారి సమస్యల పరిష్కానికి కృషి చేస్తానన్నారు. అనంతరం అధ్యక్షుడు సయ్యద్ బాజీకి కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

భీమవరం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ అహ్మద్ ఉన్నీషా అన్నారు. విద్యాలయాల వద్ద ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే వెంటనే డయల్ 112 కి సమాచారం అందిస్తే పది నిమిషాల వ్యవధిలో ×మహిళా రక్షక్ టీమ్స్≈ వారు మీకు రక్షణ కల్పిస్తారని తెలిపారు. పట్టణంలోని సెంట్ ఆన్స్ విద్యార్థినిలకు సైబర్ క్రైమ్, పోక్సో, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు వారి యొక్క ఆత్మ రక్షణకు పోరాట విద్యను తప్పనిసరిగా నేర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా రక్షక్ టీమ్స్ లో గల మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడిగా కోరా రామ్మూర్తి

కాళ్ల: సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (జెడ్ఆర్‌యూసీసీ) సభ్యుడిగా బీజేపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరా రామ్మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చేతులమీదుగా ఉత్తర్వులను రామ్మూర్తి అందుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడుకు సముచిత స్థానం లభిస్తుందన్నారు.

రైల్వే శాఖ ప్రకటనతో ప్రజల్లో ఆందోళన

గేట్లు మూత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్

పాలకొల్లు అర్బన్: రైల్వే గేట్లు మూసివేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ఇటీవల రైల్వే శాఖ ఉన్నతాధికారులు ప్రకటించడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాలకొల్లు మండలంలో సుమారు 15 కిలోమీటర్లు పైగా రైల్వే లైన్ విస్తరించింది ఉంది. సుమారు 20 గ్రామాల ప్రజలకు రైల్వే గేట్లు కలుపుతూ ఉన్నాయి. దీంతో ఈ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అండర్ టన్నెల్ లేదా ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించడానికి రైల్వే శాఖ ప్రతిపాదనలు కోరినట్లు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు చెబుతున్నారు. అయితే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ చేయాల్సి ఉంటుంది. దీంతో భూములు, భవనాలు కోల్పోవాల్సి వస్తుందని సమీప ప్రాంత ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న రైల్వే గేట్లు యథావిధిగా ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని సగంచెరువు, గోరింటాడ, చింతపర్రు, లంకలకోడేరు, గవరపేట, శివదేవునిచిక్కాల, జొన్నలగరువు ప్రాంతాల్లో రైల్వే గేట్లు ఉన్నాయి. బల్లిపాడు – బల్లిపాడు గరువు ప్రాంతాల మధ్య, అలాగే లంకలకోడేరు – వెదుళ్లపాలెం మధ్య రైల్వే గేట్లను సుమారు 5 ఏళ్ల క్రితం మూసేశారు. దీంతో ఈ గ్రామాల ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు.

ఫ్లై ఓవర్లే ప్రత్యామ్నాయం

రైల్వే గేట్లు మూసివేత ప్రతిపాదనలు ఉన్న గ్రామాల్లో భూములకు, భవనాలకు నష్టం లేకుండా ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రైతుల భూములు, పశువుల పాకలు రైల్వే గేటు ఆవతల ఉండడం వల్ల నిత్యం రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనివలన వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు, వ్యవసాయ కూలీలు నిత్యం రైల్వే గేటు దాటి వెళుతుంటారు. చాలా ప్రాంతాల్లో అండర్ టన్నెల్ నిర్మాణం వీలు కాదని రైతులు, ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే లైన్‌ను ఆనుకుని నరసాపురం – నిడదవోలు పంట కాలువ, అలాగే భగ్గేశ్వరం పంట కాలువ, రాపాక పంటకాలువలు ప్రవహిస్తున్నాయి. అండర్ టన్నెల్ నిర్మిస్తే నీరు ఊరుతుందని ఫ్లై ఓవర్లే నిర్మాణమే మేలని చెబుతున్నారు.



పాలకొల్లు మండలం గవరపేటలో రైల్వే గేటు

చింతపర్రు గేటు మూయవద్దు



చింతపర్రు గేటు మూయవద్దని పంచాయతీ తరపున తీర్మానించాం. ఫ్లై ఓవర్ బ్రిడ్జి గాని, లేదా అండర్ టన్నెల్ నిర్మిస్తే రైతుల భూములకు, భవనాలకు నష్టం లేకుండా చేయాలని రైల్వే అధికారులను కోరాం. ఈ గేటు చాలా ప్రాధాన్యం ఉంది. సుమారు 5 గ్రామాల ప్రజలు నిత్యం దీని మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు.

– గుమ్మాపు పెద్దిరాజు, సర్పంచ్, చింతపర్రు

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి



గవరపేట – దగ్గులూరు గ్రామాల మధ్య ఉన్న రైల్వే గేటు ఆనుకుని ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి. ఇప్పటికే పాలమూరు, గవరపేట గ్రామ పంచాయతీల నుంచి తీర్మానాలు ఇచ్చాం. ఈ రెండు గ్రామాలు సామాజికంగా పేద వర్గాలు ఎక్కువ. రైల్వే గేటు మూసివేస్తే ఉపాధి అవకాశాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడతారు. అధికారులు సానుకూలంగా స్పందించాలి.

– మళ్ల వెంకట మురళి, మాజీ సర్పంచ్, గవరపేట

రేపు వల్లాలమ్మ జాతర

నరసాపురం: పట్టణంలోని టేలర్‌పేటలో ఉన్న శ్రీ వల్లాలమ్మ వారి జాతర ఊరేగింపు సోమవారం రాత్రి 8 గంటలు నుంచి వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ధర్మకర్త అద్దింకి రాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తోన్న అమ్మవారి జాతర ఉత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని స్పష్టం చేశారు.

సైకిల్ షెడ్ ప్రారంభం



సైకిల్ షెడ్ ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

పెనుగొండ: దేవలోని ఎస్ఎంబీటీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన సైకిల్‌షెడ్ శనివారం ప్రారంభించారు. 1991–92 విద్యాసంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు నిర్మాణానికి సహకరించారని ప్రధానోపాధ్యాయుడు ఏఎల్ నగేష్ తెలిపారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మామిడిశెట్టి వీవీఎస్ సత్యనారాయణ, జక్కం కేడీవీ ప్రసాద్, బద్దా రమేష్, కంబాల రాంబాబు, నేలపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పీడీఎఫ్‌కు మద్దతు ఇవ్వాలి



కరుగోరుమిల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ సభ్యులు

పెనుగొండ: యువజనులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉభయ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా పీడీఎఫ్ బలపరిచిన దిడ్ల వీర రాఘవులకు మద్దతు నివ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎస్ శర్మ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆచంట మండలంలో దిడ్లకు మద్దతుగా కరుగోరుమిల్లిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ, టీచర్ పోస్టుల భర్తీ, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలలు దాటుతున్నా వాగ్దానాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి పోరాటం చేసే పీడీఎఫ్‌కు మద్దతుగా నిలవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పి.చంటిబాబు, టి.దుర్గా ప్రసాద్, మోహన్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌తో ఎంతో ఉపకారం



నైపుణ్యాభివృద్ధి సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అప్పారావు

పెనుగొండ: అధ్యాపకులు, విద్యార్థులు ఎన్ఐఆర్ఎఫ్‌లో మంచి ర్యాంకుకు చేరుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవాలని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు తెలిపారు. కళాశాలలో నైపుణ్యాభివృద్ధిపై నిర్వహిస్తున్న నాలుగో రోజు సదస్సులో ఆయన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్, జువాలజీ విభాగ ఆచార్యులు పి.విజయ నిర్మల మాట్లాడుతూ ర్యాంకింగ్‌లతో విద్యాసంస్థలకు ప్రయోజనం ఉంటుందన్నారు. కోర్సు పూర్తి చేసిన వారి ప్రమాణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆచార్య పి.ఉమామహేశ్వరి, సదస్సు కో–ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం కోసం కాకుండా విజ్ఞానం కోసం చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్

ఆకివీడు: బంగారు భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంది, ఎదురు చూస్తే ఎండమావేగానే మీ జీవితం మిగులుతుందని ప్రముఖ అడ్వకేట్, సినీ నటుడు, వెబ్ సీరియల్స్ నిర్మాణకర్త ప్రేమ్ సాగర్ చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులను ద్దేశించి ఆయన మాట్లాడారు. పేద కుటుంబంలో జన్మించిన తాను నేడు ఈ స్థితికి రావడానికి కృషి, పట్టుదల ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థీ ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. తాను ఎంచుకున్న మార్గంలో విజయం సాధించడం కోసం నిరంతరం ప్రయత్నాలు చేయాలన్నారు. ఉద్యోగం కోసమే చదవకూడదని, విజ్ఞానం కోసం చదివితే ప్రపంచంలో అనేక ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ప్రేమ్‌సాగర్ చెప్పారు. అందరూ ఉద్యోగం కోసం ఎదురు చూస్తే కాలం వృద్ధా అవుతుందన్నారు. నేటి ఆధునిక యుగంలో చదవు ఎంతో ముఖ్యమని చెప్పారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి ఉన్నత స్థితికి ఎదిగిన ప్రేమ్‌సాగర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రేమ్ సాగర్‌ను ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో సరిగమ సంగీత పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.కోటేశ్వరరావు(పాటలకోటి) పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో బీఐఎస్ స్టాండర్డ్స్ పరిగణనలోకి తీసుకోవాలి



విద్యార్థి సింపోజియంలో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం: కోస్టల్ రీజియన్ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టిన బీఐఎస్ స్టాండర్డ్స్ పరిగణనలోకి తీసుకోవాలని మహేంద్ర యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ కళ్యాణ రామజోష్యుల చెప్పారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం సూపర్ నోవా కార్యక్రటమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోస్తా రీజియన్‌లో సెలైన్ కంటెంట్ ఎక్కువగా ఉన్నందువల్ల నిర్మాణ సామగ్రితో పాటు భీమ్, కాంక్రీట్ విషయాల్లో బీఐఎస్ స్టాండర్డ్స్ పరిశీలించాలన్నారు. సివిల్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు తగిన విధంగా టెక్నాలజీ డెవలప్‌మెంట్‌తో యంత్రాలు వస్తున్న మార్పులు గమనించాలని కోరారు.

ప్లాస్టిక్‌తో ప్రాణాంతక వ్యాధులు



పాలకొల్లు అర్బన్: చింతపర్రులో గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి



యలమంచిలి: మేడపాడు అంగన్‌వాడీ కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మనిషి సృష్టించిన ప్లాస్టిక్ మనిషినే తినేసేంతగా విస్తరించిందని, దీని కారణంగా చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆందోళన వ్యక్తం చేశారు. పాలకొల్లు మండలం చింతపర్రులో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టర్ నాగరాణి పాల్గొని వివిధ శాఖల అధికారులతో స్వచ్ఛ–ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. నీటిలో, భూమిలో, గాలిలో ప్లాస్టిక్ విపరీతంగా కలిసిపోయి వనరులను కలుషితం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ పదార్థాల ద్వారా ప్రతి వ్యక్తి ప్లాస్టిక్‌ను ప్రతి రోజూ స్వల్పంగా తింటున్నట్లు ఒక సర్వేలో వెల్లడైందని వివరించారు. ప్లాస్టిక్ నిషేధం ఒకరితో ముడిపడింది కాదని, ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే నియంత్రించ వచ్చన్నారు. తొలి ప్రయత్నంగా జిల్లా కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ బదులుగా స్టీల్ వస్తువులను వినియోగిస్తున్నట్లు వివరించారు. ప్రతి ప్రభుత్వ శాఖ కార్యాలయంలో ప్లాస్టిక్ బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని కోరారు. ఫ్లెక్సీల స్థానంలో క్లాత్ బ్యానర్లు వినియోగిస్తే పర్యావరణానికి ఎలాంటి హానీ కలగదన్నారు. ఇంటి వద్ద తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. అలాగే మార్కెట్‌కి వెళ్లేటప్పుడు గుడ్డ సంచిని వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని కలెక్టర్ నాగరాణి కోరారు. గ్రామంలో పర్యటించి ఇంటింటికీ గుడ్డ సంచులను పంపిణీ చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం అనే నినాదంతో తయారు చేసిన సెల్ఫీ పాయింట్‌ను కలెక్టర్ నాగరాణి ప్రారంభించి ఫొటో దిగారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, ఉప సర్పంచ్ పెన్మెత్స వెంకట కృష్ణంరాజు, జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ, తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, ఎంపీడీఓ ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు, సీడీపీఓ సీహెచ్ ఇందిర, ఈఓపీఆర్‌డీ తాళ్ల మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శి శివ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

నరసాపురం: నరసాపురం మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రారంభించిన కమిషనర్ ఎం.అంజయ్య మాట్లాడుతూ క్లీన్ నరసాపురం సాధనకు ప్రజలు సహకరించాలని చెప్పారు. మున్సిపల్ ఇండోర్, అవుట్‌డోర్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: రాష్ట్ర ప్రజలంతా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ మహ్మద్ హసీనా కోరారు. మేడపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఆమె అంగన్‌వాడీ టీచర్లు, తల్లులతో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మాణ ప్రతిజ్ఞ చేయించారు. మన పరిసరాలను శుభ్రంగా ఉంచడంతోపాటు, పక్క ఇళ్లలోని వారి చేత కూడా శుభ్రం చేయించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మహాలక్ష్మి, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



చీపురు పట్టుకుని కార్యాలయ ఆవరణను శుభ్రం చేస్తున్న ఆర్డీఓ, ఉద్యోగులు

నరసాపురం: పరిసరాల పరిశుభ్రత అనేది మన అందరి బాధ్యతగా గుర్తించాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి ఆర్డీవో స్వయంగా చీపురు పట్టుకుని సబ్ కలెక్టర్ కార్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు. కార్యాలయం ఆవరణ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చెప్పారు. మన ఇంటి నుంచే ముందు మార్పు రావాలని సూచించారు. ప్రాణాంతక క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉన్నందున ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఉద్యోగస్తులకు సూచించారు.

రాజీ మార్గమే రాజమార్గం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గంగరాజు



సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న రత్నప్రసాద్

నరసాపురం: రాజీ మార్గమే రాచమార్గమని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు అన్నారు. మార్చి 8న నిర్వహించనున్న లోక్ అదాలత్ కోసం శనివారం కోర్టులో బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించి రాజీ చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. గతంలో కంటే ఎక్కువ కేసులు పరిష్కారం లచ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ, కార్యదర్శి రంపా పుల్లాజీ , ట్రెజరర్ పూరిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ

నరసాపురం: రిమాండ్‌లో ఉండి ఆర్థిక స్థోమత లేని కారణంగా బెయిల్ కోసం న్యాయవాదిని నియమించుకోలేనివారు మండల న్యాయసేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి టి.రత్నప్రసాద్ చెప్పారు. శనివారం ఆయన నరసాపురం సబ్‌జైలును తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీల కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, ఇతర సదు పాయాలులపై ఆరా తీశారు. జైలు ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నరసాపురం జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు పాల్గొన్నారు.

తలరాతను మార్చే చేతిరాత

- మార్కుల సాధించడంలో కీలకపాత్ర పోషించనున్న హ్యాండ్ రైటింగ్
- త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

యలమంచిలి: ఇది పరీక్షల కాలం. పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు చక్కని చేతిరాత (దస్తూరీ) కీలకమని నిపుణులు చెబుతున్నారు. జవాబు పత్రం మూల్యాంకనం చేసే వారికి స్పష్టంగా జవాబు అర్థమయ్యేలా అందంగా చేతిరాత ఉంటే ఫుల్ మార్కులు సాధించవచ్చు. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో విద్యార్థుల ధ్యాస అంతా చదువుపైనే ఉంది. ఇదే సమయంలో చదువుతో పాటు అందమైన చేతిరాతపై దృష్టి సారించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. పరీక్షలప్పుడు విద్యార్థులు సహజంగా ఒత్తిడికి లోనవుతారు. పరీక్షలు రాసేటప్పుడు మొదట మెల్లగా, అందంగా రాస్తారు. క్రమక్రమంగా సమయం అయిపోతుందనే తొందరలో చేతిరాతలో వేగం పెంచుతారు. అప్పుడు ముందు రాసినది బాగా ఉండి, చివరలో రాసినది అంత బాగా ఉండదు. అలా కాకుండా పరీక్ష రాసే మొదటి నుంచి చివరి వరకు ఒక చేతిరాత ఉంటే మనం ఆశించిన మార్కులు వస్తాయని నిపుణులు వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చేతి రాతను విద్యార్థులు నిర్లక్ష్యం చేయకూడదని ఉపాధ్యాయులు సలహా ఇస్తున్నారు. మంచి చేతిరాత ద్వారా పొందిన మార్కులే రేపో మాపో ఉన్నత చదువుల సీట్లు, ఉద్యోగాలు పొందేందుకు వెయిటేజీ మార్కులుగా ఉపయోగపడతాయని చెబుతున్నారు.

మార్చి నుంచి పబ్లిక్ పరీక్షలు

ఈ ఏడాది మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అలాగే మార్చి 17 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. నియోజకవర్గంలో 2468 మంది ఇంటర్ మొదటి సంవత్సరం, 2542 మంది ద్వితీయ సంవత్సరం, 3198 మంది పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారు.

జవాబు పత్రమే కీలకం

మంచి మార్కులను జవాబు పత్రం అందంగా ఉండేలా చూసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. జవాబు పత్రం పైభాగంలో అంగుళం స్థలం వదలాలి. ఎడమ వైపు అదే స్థాయిలో మార్జిన్ విడిచిపెట్టాలి. కుడివైపు అర అంగుళం ఖాళీ వదిలి రాయాలి. తెల్ల కాగితంపై సమాధానాలు రాయడం సాధన చేయాలి. గణితానికి సంబంధించి అంకెలు, సంఖ్యలు సక్రమంగా రాయాలి. వ్యాకరణ దోషాలు లేకుండా జాగ్రత్తపడాలి. జవాబు రాయడం మొదలెట్టిన దగ్గర నుంచి చివరి వరకు సమాంతరంగా రాయాలి. పదానికి పదానికి, వాక్యానికి వాక్యానికీ మధ్య తగిన నిడివి పాటించాలి. పెన్నును గట్టిగా బిగపట్టి రాయవద్దు, ప్రశాంతంగా పెన్ను తేలికగా పట్టుకుని రాయాలి. పేజీకి 16 నుంచి 20 లైన్లు మించి రాయకూడదు.

మంచి దస్తూరితోనే మార్కులు



పబ్లిక్ పరీక్షలు ఏవైనా మంచి దస్తూరీతో జవాబులు రాస్తే స్కోరింగ్ చేయవచ్చు. పరీక్ష పత్రంలో జవాబు రాసేటప్పుడు కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి. చక్కని దస్తూరితో అన్ని జవాబులు రాసేందుకు ప్రయత్నించాలి. అక్షరాలు దిద్దడం, కొట్టివేయడం వంటివి చేయొద్దు. రోజూ కొద్ది సేపు సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు. మంచి చేతిరాతను మార్కులు వేసేందుకు పరిగణలోకి తీసుకుంటారు.

– అద్దాల శివరామకృష్ణంరాజు, డ్రాయింగ్ టీచర్, మేడపాడు హైస్కూల్